క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనిత

జైపూర్: సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా అన్ని గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత తెలిపారు. జైపూర్ ఆస్పత్రిని సోమవారం ఆమె సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య పరీక్షలపై ఆరా తీశారు. నాణ్యమైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం మందుల గది, వ్యాక్సినేషన్ గదిని పరిశీలించి అన్నిరకాల మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయా లేవా అని పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మరమ్మతుల కారణంగా చెన్నూర్ పట్టణంతో పాటు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

ఏకలవ్య ఆశ్రమ విద్యార్థులకు భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తూ...

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఏకలవ్య ఆశ్రమంలో సోమవారం మహిళలు విద్యార్థులకు భోజనాన్ని అందించారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒక్కచోట చేరిన స్నేహితులు విద్యార్థులకు భోజనం, పండ్లను అందించినట్లు తెలిపారు. మహిళా న్యాయవాది అలేఖ్య, భాగ్యలక్ష్మి, భారతి, గీత పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటపల్లి: హైదరాబాద్ ఐసీఏఆర్ సీఆర్ఐడీఏ వారి ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి వచ్చిన సీడ్ ప్లాంటర్(విత్తనాలు విత్తుకునే పరికరం)ని కోటపల్లి మండలంలోని మల్లంపేట గ్రామంలోని ఎస్సీ సొసైటీకి రాగా సోమవారం ఆ పరికరాన్ని క్రీడా నోడల్ అధికారి డాక్టర్ టీవీ.ప్రసాద్, డాక్టర్ సుహానా రైతులకు అందజేశారు. రైతులు ఈ సీడ్ ప్లాంటర్‌ను ఉపయోగించుకొని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. రైతుల పొలంలోని మట్టి పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రాజ్‌కుమార్, సబ్‌ప్లాన్ మండల కోఆర్డినేటర్లు సంపత్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం

పాతమంచిర్యాల: భవన నిర్మాణ కార్మిక సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం లోగోతో కూడిన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు మల్క చంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దపల్లి సూరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మంచర్ల సధానందం, కోశాధికారి ఎస్‌కే ఘని, ముఖ్య సలహాదారు కోటయ్య, ఉపాధ్యక్షుడు భీమయ్య, 2వ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఈవో ముక్తారవి

మంచిర్యాలఅర్బన్/మందమర్రిరూరల్: శ్రావణ మాసం ప్రారంభం కావటంతో సోమవారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి అభిషేకాలు జరిపారు. జిల్లా కేంద్రంలోని విశ్వనాథస్వామి ఆలయంలో ఈవో ముక్తారవి, అర్చకులు నరహరిశర్మ, భట్టాచార్య, బాలక్రిష్ణ పాల్గొన్నారు. మందమర్రి మూడో జోన్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో అర్చకులు వెంకటాచారి స్వాముల వారికి అభిషేకం చేశారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' షురూ

- ఊరూరా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన
- మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేత



చెన్నూర్: రోడ్డు ఊడుస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు

బెల్లంపల్లి/నస్పూర్/మందమర్రిరూరల్/చెన్నూర్/రామకృష్ణాపూర్/మంచిర్యాలటౌన్: జిల్లా వ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచుతూ, పరిశుభ్రతను మెరుగు పరిచేలా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. పల్లెలు, పట్టణాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. చెత్తను ఎప్పటికప్పుడు ఇళ్లలో నుంచి తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

- మంచిర్యాల మున్సిపాలిటీలోని 15, 16, 17వార్డుల్లో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మంచిర్యాల స్పెషల్ ఆఫీసర్ శ్రీపాద రామేశ్వర్, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ ప్రారంభించారు. మున్సిపాలిటీలో ఉన్న 36వార్డుల్లో వార్డుకు ఒక వార్డు ఆఫీసర్, ఆర్పీ, సీవో, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, ఏఎల్ఎఫ్ మెంబర్లు టీంలుగా ఏర్పడి ప్రతీరోజు పారిశుధ్యం, తాగునీటి వసతి, నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించి, వాటిలో మొరం పోసే పనులతో పాటు, దోమల నివారణకు ఆయిల్ బాల్స్‌ను వేయనున్నట్లు తెలిపారు. పారిశుధ్యంపై అవగాహన ర్యాలీని విద్యార్థులతో కలిసి నిర్వహించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పూదరి సునిత, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, పూదరి ప్రభాకర్, టీఎంసి చంద్రయ్య, సీవో పి. జ్యోతి, కృష్ణవేణి, ఎం. సునిత, పుష్పలీల, అరుణ, సుజాత, సరోజ పాల్గొన్నారు.
- బెల్లంపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ జె.శ్వేత, పలువురు మహిళా కౌన్సిలర్లు చీపురుపట్టి ఊడ్చారు. మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడానికి పుర ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మెప్మా, ఆశా సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.
- నస్పూర్ సీసీసీ కార్నర్ నుంచి రాయల్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదని, మొక్కలు విరివిగా పెంచాలని, సానిటేషన్, డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్, కౌన్సిలర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మందమర్రిలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి పలు వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది, మెప్మా, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, పలు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.
- చెన్నూర్ మున్సిపాలిటీలో 16, 18వార్డులలో పారిశుధ్య పనులు నిర్వహించారు. కొత్త బస్టాండ్ ఏరియాలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనగిల్డా, కమిషనర్ గంగాధర్‌లతో పాటు కౌన్సిలర్లు రోడ్లు ఊడ్చారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధం, చెత్తను వేరుచేయడం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ మురళీ కృష్ణ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు ప్రారంభించారు. వర్షాకాలం దృష్ట్యా దోమలు వ్యాప్తి చెందకుండ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.



నస్పూర్: ర్యాలీలో పాల్గొన్న చైర్మన్, కమిషనర్



రామకృష్ణాపూర్: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



దండేపల్లి: విద్యార్థులతో ర్యాలీ

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

భీమారం/కాసిపేట/దండేపల్లి/జన్నారం/జైపూర్/భీమిని/చెన్నూర్‌రూరల్/వేమనపల్లి/తాండూర్/బెల్లంపల్లిరూరల్/నెన్నెల/మంచిర్యాలరూరల్(హాజీపూర్): పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించగా జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. వాటర్ ట్యాంకు ప్రాంతంలో శ్రమదానం నిర్వహించారు. చెట్ల పెంపకంతోనే మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పలువురు అధికారులు, నాయకులు పేర్కొన్నారు. డీఈవో యాదయ్య ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలను సందర్శించి స్వచ్ఛదనం-పచ్చదనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్న భోజన తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భీమారం: ర్యాలీలో విద్యార్థులు, ఎంపీడీవో



కిష్టంపేటలో ర్యాలీలో పాల్గొన్న డీపీవో



జిల్లా కేంద్రంలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, అధికారులు



మందమర్రిరూరల్: అవగాహన ర్యాలీ



బెల్లంపల్లిలో ర్యాలీ తీస్తున్న చైర్‌పర్సన్, సిబ్బంది

ఎమ్మెల్యే వెళ్లే దారిలో కూర్చొని నిరసన



రోడ్డుపై కూర్చొని నిరసన తెలుపుతున్న భూమాచారి

జన్నారం: మండలంలో అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేసి వాహనాల రాకపోకలకు అనుమతివ్వాలని డిమాండ్ చేస్తూ, ఎమ్మెల్యే ఈ విషయాన్ని సీఎంతో చర్చించాలని కోరుతూ సోమవారం సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి ఎమ్మెల్యే వెళ్లే దారిలో కూర్చొని నిరసన తెలిపారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జన్నారంకు రాగా మండల సమస్యలపై, అటవీ ఆంక్షలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో లేవనెత్తి, సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్లకార్డులతో ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలో రోడ్డుపై బైటాయించాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజవర్ధన్ ఆయన వద్దకు చేరుకుని సముదాయించాడు. ఏదైనా ఉంటే నేరుగా వెళ్లి మాట్లాడుకోవాలని, ఇలా రోడ్డుపై బైటాయించి ఇతరులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు.

'మా భూములు మాకు ఇప్పించండి'



మండల పరిషత్ కార్యాలయం వద్ద బాధితులు

తాండూర్: కబ్జాకు గురైన తమ భూమిని తమకు ఇప్పించి ఆదుకోవాలని మండలంలోని నీలాయపల్లి గ్రామానికి చెందిన బాధితులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వం తాండూర్ శివారులోని 669 /12 /1 లో ఏడు ఎకరాల సీలింగ్ భూమిని నీలాయపల్లి గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసిందన్నారు. ఆ భూమిలో 3.45ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకొని రైస్ మిల్ కడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, తమ భూమిని తమకు కేటాయించేలా చూసి ,న్యాయం చేయాలని వేడుకున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మడే పెంటయ్య, కాటపాటి మురళి, సాయి,దాసరి శ్రీనివాస్, చిన్నక్క,.గౌరక్క, లక్ష్మిలు ఉన్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

మంచిర్యాలటౌన్: జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ శ్రీధర్, పోషన్ అభియాన్ రజిత, డీపీఏ శ్యామల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచన దేవి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

దండేపల్లి: తల్లిపాలు తాగడంతోనే పిల్లల్లో ఎదుగుదల ఎక్కువ ఉంటుందని లక్సెట్టిపేట సీడీపీవో రేష్మా అన్నారు. మండలంలోని తాళ్లపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏఎన్ఎం రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పలత, పద్మ, జ్యోతిరాణి, పద్మ, ప్రమీలా, ఆయాలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



దండేపల్లి: మాట్లాడుతున్న సీడీపీవో రేష్మా

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారిని అనిత హాజరై గ్రామంలో ర్యాలీలో పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యామల, గ్రామ కార్యదర్శి హరీష్, ఏఎన్ఎం సుజాత, అంగన్‌వాడీ టీచర్ రజిత పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి: తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తపాలా శాఖ ఏఎస్పీ రాథోడ్ రామారావు అన్నారు. మండలంలోని మేదరిపేటలో తపాలా సేవలపై సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. తపాలా శాఖ ద్వారా పొదుపు పథకాలు, తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దండేపల్లి సబ్‌పోస్ట్ మాస్టర్ గురువయ్య, బీపీఎం లక్ష్మణ్, ఏఈవో సృజన్య, కార్యదర్శి శ్రావణ్, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ ప్రజలు పాల్గొన్నారు.

కాసిపేట: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలోని పొదుపు పథకాలతో పాటు ఇతర ప్రయోజనాలు వినియోగించుకోవాలని బెల్లంపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఆర్ విక్రమ్ తెలిపారు. మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికి పెద్దపీట

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండలంలో సోమవారం పర్యటించారు. పొనకల్ రైతువేదిక ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం జన్నారం ప్రెస్‌క్లబ్ భవన అదనపు పనులను ప్రారంభించారు. తపాలపూర్‌లో అంగన్‌వాడీ భవనం, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులను ప్రారంభించారు. లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ చేసి, జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీవో కిషన్, ఎంపీడీవో శశికళ, ఏపీవో రవీందర్, పొనకల్ ఈవో రాహుల్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కరెంట్ తీగలపై అల్లుకున్న నిర్లక్ష్యం

బెల్లంపల్లి మున్సిపాలిటీ రాంనగర్ బస్తీ ఇందిరమ్మ కాలనీలో ఉన్న విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు నిండుగా అల్లుకున్నాయి. వీటివల్ల ప్రతీసారి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. వర్షాకాలం కావడంతో పచ్చదనాన్ని సంతరించుకున్న చెట్ల కొమ్మలు కరెంట్ తీగలపై ఏపుగా ఎగబాకాయి. అసలు కరెంట్ తీగలు కనిపించకుండా కొమ్మలన్నీ నిండుగా కమ్ముకున్నాయి. కరెంట్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలను తొలగించాల్సి ఉండగా, విద్యుత్ అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వెంటనే స్పందించి విద్యుత్ తీగలపైకి ఎక్కిన చెట్ల కొమ్మల కత్తిరింపు పనులు చేపట్టి, కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – బెల్లంపల్లి









నిషేధిత ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు



తనిఖీ నిర్వహిస్తున్న బెల్లంపల్లిరూరల్ సీఐ, ఎస్సై



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్‌హెచ్‌వో దేవయ్య

భీమారం/బెల్లంపల్లిరూరల్/బెల్లంపల్లి/నెన్నెల/భీమిని/కాసిపేట/తాండూర్: నిషేధిత మత్తు పదార్థాలు, గంజాయి, పొగాకు ఉత్పత్తులను అమ్మితే కఠిన చర్యలు తప్పవని దుకాణదారులను పోలీసులు హెచ్చరించారు. జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో సోమవారం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంబార్ నిషేధిత పొగాకు ఉత్పత్తులతో పాటు ఇంకా ఏ ఇతర ఉత్పత్తులు అమ్మినా, పాఠశాల సమీపంలో ఎలాంటి విక్రయాలు చేపట్టినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి లాంటి క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు ప్రజల దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దిన్, తాళ్లగురిజాల అదనపు ఎస్సై నూనె శ్రీనివాస్, భీమారంలో ఎస్సై రాములు, తాండూర్‌లో ఎస్సై కిరణ్ కుమార్, బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, నెన్నెల ఎస్సై ప్రసాద్, భీమిని ఎస్సై గంగారాం, కన్నెపల్లి ఎస్సై విజయ్‌కుమార్, కాసిపేట ఏఎస్ఐ రవీందర్, జైపూర్ ఎస్సై శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీపీఐ నూతన కమిటీ

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం మండల సీపీఐ నూతన కమిటీని నియమించినట్లు జిల్లా నాయకులు లక్ష్మణ్, మేకల దాసు, లింగం రవి సోమవారం తెలిపారు. మండల కార్యదర్శిగా మేదరి దేవవరం, సహాయ కార్యదర్శి కేతిరెడ్డి రమణారెడ్డి, కోశాధికారిగా లింగంపల్లి బానుచందర్, కార్యవర్గ సభ్యులు దుర్గం దేవదాసు, ఆవునూరి వెంకటేష్, రాచర్ల రవికిరణ్, ఆకుల రామన్న, బైరి రాజన్న, తిప్పని సత్తన్న, చింతల ఐలయ్య, జూల పోచయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక

జైపూర్: మండల ప్రైవేట్ పాఠశాలల యజమానుల నూతన కమిటీని సోమవారం ఏర్పాటు చేసినట్లుగా ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెతుల రాజేంద్రపాని తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన మండల అధ్యక్షుడిగా గూడ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బాషిరోద్దిన్, కోశాధికారిగా ప్రసాద్, సెక్రెటరీగా మొహిద్‌లను ఎన్నుకునట్లుగా వారు ప్రకటించారు.

వాకింగ్ ట్రాక్ సమస్య పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువు కట్టపై నిర్మించిన వాకింగ్ ట్రాక్ సమస్యను పరిష్కరించాలని వాకర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, జాయింట్ సెక్రటరీ పుప్పిరెడ్డి రాంరెడ్డి, సలహాదారులు జి. సత్యనారాయణ మూర్తి, ఆడిచర్ల రాజేశ్, ఈ. సత్యనారాయణ పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేట గ్రామానికి చెందిన ఒడిశ్ల సుధాకర్ అనే వ్యక్తి ఆరు నెలల క్రితం మొబైల్ ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆ మొబైల్ ఫోన్‌ను కనుగొని సోమవారం నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ బాధితుడికి అప్పగించారు.

ఆర్థికసాయం

మందమర్రిరూరల్: ఇటీవల తలిదండ్రులను కోల్పోయి అనాథలైన ఊరుమందమర్రికి చెందిన అర్చన, అభిలాషలకు టీం పంచముఖి స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. సంస్థ ఆధ్వర్యంలో సేకరించిన రూ.25వేలు సోమవారం ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా యువతులకు అందించారు.